సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.993 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 8.993 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు విడుదల చేస్తున్న సాగునీటిని అధికారులు నిలుపుదల చేశారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.72,,130
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,443
3శాతం జీఎస్టీతో	రూ.6,636
నవర (8గ్రాములు)	రూ.53,088



వాహనాల తనిఖీ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి ఎస్పీ ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ వెంకటాచలం పోలీస్‌స్టేషన్, టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.



న్యూస్‌రీల్

ముగిసిన పది మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాలు దిద్దే కార్యక్రమం ముగిసింది. నగరంలోని దర్గామిట్ట జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాకు వచ్చిన 1,80,414 జవాబు పత్రాల మూల్యాంకనాన్ని విజయవంతంగా ముగించారు. కలెక్టర్ హరి నారాయణన్, జిల్లా పరిశీలకుడు, పాఠశాల విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం పర్యవేక్షణలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేశామని డీఈఓ రామారావు తెలిపారు. ఫలితాలు త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు.

టీడీపీ ఆత్మీయ సమావేశంలో అపశ్రుతి



నేలకొరిగిన షామియానాలు

కొడవలూరు: టీడీపీ ఆత్మీయ సమావేశంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు టీడీపీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంతిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ముందుగానే వేదిక ఏర్పాటు చేశారు. ఈ వేదికపై వేసిన షామియానాలు తూతూమంత్రంగా వేయడంతో మధ్యాహ్నం 2.10 గంటలకు వీచిన గాలులకు నేలకొరిగాయి. కుర్చీలు సైతం చల్లాచెదురుగా పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. అయితే పడిపోయిన షామియానాలను పునరుద్ధరించాలంటే బాగా సమయం పట్టే అవకాశం ఉండడంతో వాటిని పునరుద్ధరించకుండానే సమావేశాన్ని 2.50 గంటలకు ప్రారంభించి కొనసాగించారు. షామియానాలు లేకపోవడంతో సమావేశానికి వచ్చిన వారంతా ఎండలోనే ఉండిపోవాల్సి వచ్చింది.

భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో గత ఏడాది కన్నా ఈ ఏడాది విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వి.విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది కన్నా ఈ ఏడాది 20 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. గతేడాది వేసవిలో రోజుకు 13 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగ్గా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో 14 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, పగటిపూట వీధిలైట్లు వెలిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాలీసెట్ పరీక్షకు సన్నద్ధం

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 27వ తేదీన జరగనున్న పాలీసెట్ పరీక్షకు సన్నద్ధం కావాలని డీఆర్వో లవన్న అధికారులకు సూచించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ నెల్లూరు, ఆత్మకూరు, కావలిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, వీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్, అల్‌హుదా, పాలిటెక్నిక్, డాక్టర్ ఎస్ఆర్‌కే ఇంగ్లిషు మీడియం పాఠశాల, జగన్స్ డిగ్రీ కళాశాల, ఆత్మకూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కావలిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో ఆధారిత ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

టీడీపీకి భంగపాటు!

ఆత్మీయ సమ్మేళనాలు, ప్రజాగళం సభలు అట్టర్‌ఫ్లాప్

- క్షేత్రస్థాయిలో పచ్చపార్టీకి పెరగని గ్రాఫ్
- అభ్యర్థులను వెంటాడుతున్న వర్గపోరు
- ఎన్నికల తర్వాత కనుమరుగయ్యేనా..?
- ఇదీ జిల్లాలో టీడీపీ దుస్థితి



టీడీపీని ఓటమి భయం వెంటాడుతోంది. జిల్లాలోని ఏ నియోజకవర్గాన్ని చూసినా అన్నీ ప్రతికూలతలే కనిపిస్తున్నాయి. ఆ పార్టీ టికెట్ దక్కించుకున్న నేతలకు వర్గ పోరు తప్పడం లేదు. సీటు ఆశించి భంగపాటుకు గురైన వారు అభ్యర్థులకు సహకరించడం లేదు. దీంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటమి తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో టీడీపీ వేసిన ఎత్తులు ఫలించక ఆ పార్టీ అధిష్టానం అంతర్మథనంలో పడింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ అభ్యర్థులను వర్గపోరు వెంటాడుతోంది. ఆయా నియోజకవర్గాల్లో టికెట్ ఆశించి భంగపడిన నేతలు అభ్యర్థులకు పరోక్షంగా వెన్నుపోటుకు సిద్ధమవుతున్న పరిస్థితి. ఎన్ని ఎత్తులు వేసినా క్షేత్రస్థాయిలో టీడీపీ గ్రాఫ్ ఏమాత్రం మెరుగుపడలేదు. ఆ పార్టీ పేరు చెబితే కనీసం ప్రజలు పట్టించుకోని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. అయితే ఈ సమావేశాలకు స్థానిక నేతలు డబ్బులిచ్చి జనాన్ని తరలించినా వారు మధ్యలోనే వెళ్లిపోతున్న పరిస్థితి. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజాగళం సభలు జనం రాక అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. జన సమీకరణలో ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు విఫలం కావడంతో చంద్రబాబు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

నేతలను నమ్మని నారాయణ

నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలు, డివిజన్ స్థాయి నేతలతో పాటు మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన నేతలను సైతం ఎన్నికల నిర్వహణ బాధ్యతలకు దూరంగా పెట్టారు. తన విద్యాసంస్థల సిబ్బందితో గ్రూపులు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. నెల్లూరు సిటీ నుంచి పోటీ చేయాలని ఏళ్ల తరబడి కలలు కంటున్న టీడీపీ సీనియర్ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆశలు నారాయణ రంగప్రవేశంతో సమాధి అయిన సంగతి తెలిసిందే . టీడీపీలో క్రియాశీలక నేత, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి, ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ వంటి లీడర్లను సైతం నారాయణ దూరం పెట్టారు. ఎన్నికల క్షేత్రంలో వీరికి కనీస మర్యాద కూడా దక్కని పరిస్థితుల్లో వీరు నారాయణకు మద్దతుగా పనిచేస్తారా అనేది ప్రశ్నార్థకం. ఇక కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీల నేతలు, కేడర్‌ను సైతం దూరం పెట్టి అవమాన పరచడంతో ఎన్నికల్లో వీరు కూడా సహకరించే అవకాశాలు లేనట్లేనని స్పష్టమవుతోంది.

శ్రీధర్‌రెడ్డి వర్సెస్ అజీజ్

నెల్లూరురూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వర్గపోరును ఎదుర్కొంటున్నారు. నెల్లూరురూరల్ నుంచి పోటీ చేయాలని ఉవ్విళ్లూరిన అబ్దుల్ అజీజ్‌ను కాదని శ్రీధర్‌రెడ్డి టికెట్ దక్కించుకున్న నేపథ్యంలో అజీజ్ వర్గం కలిసి పనిచేస్తున్నప్పటికీ పోలింగ్‌కు మద్దతుగా నిలుస్తారనేది ప్రశ్నార్థకం. అంతేకాక క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండడంతో శ్రీధర్‌రెడ్డి ఓటమి తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

కోవూరులో నాలుగో కుంపటి

కోవూరు నియోజకవర్గంలో పోలంరెడ్డి, చేజర్ల, పెళ్లకూరు వర్గాలు ఉండగా.. తాజాగా వేమిరెడ్డి వర్గం తయారైంది. కోవూరు నుంచి పోటీ చేయాలని పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి ఎన్నో దఫాలుగా ప్రయత్నించగా అప్పట్లో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అడ్డుపడ్డారు. తాజాగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎంట్రీతో అక్కడ నాలుగో కుంపటి తయారైంది. ఇక్కడ అందరూ కలిసి పనిచేస్తున్నట్లే పైకి కనిపిస్తున్నా.. ఒకరికొకరు వెన్నుపోటు పొడుచుకునే పరిస్థితి ఉంది.

కావ్యకు అన్నీ ప్రతికూలతలే

కావలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి ఖరారైన నేపథ్యంలో ఆ సీటు ఆశించి భంగపడిన మాలేపాటి సుబ్బానాయుడు, బీద రవిచంద్రలతో కావ్య సఖ్యతగా వ్యవహరించడం లేదని తెలుస్తోంది. కావ్యను తొలి నుంచి టీడీపీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నారు. కావ్య సైతం పార్టీ నేతలు, మిత్రపక్షాలను దూరం పెట్టి తన సొంత టీమ్‌తో ముందుకెళుతున్నారు. చంద్రబాబు ప్రజాగళం సభకు కావ్య జనసమీకరణలో విఫలం కావడాన్ని చూస్తే కావలిలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని తెలుస్తోంది.

కాకర్లకు తొలి నుంచీ వ్యతిరేకతే

ఉదయగిరిలో టీడీపీ టికెట్ దక్కించుకున్న కాకర్ల సురేష్‌ను మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నారు. కాకర్లతో కలిసి పనిచేయాలని అధినేత చంద్రబాబు చెప్పినా బొల్లినేని ససేమిరా అన్నారు. బొల్లినేనిని కలిసేందుకు కాకర్ల ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల చంద్రబాబు వింజమూరులో నిర్వహించిన ప్రజాగళం సభకు సైతం బొల్లినేని డుమ్మా కొట్టారు. జన సమీకరణలో సైతం కాకర్ల విఫలం కావడంతో ప్రజాగళం అట్టర్‌ఫ్లాప్ అయింది. దీంతో అసహనానికి గురైన అధినేత కాకర్లను తీవ్రస్థాయిలో మందలించినట్లు తెలుస్తోంది.

పార్లమెంట్ స్థానంలో గెలుపు ఎలా?

నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపు ఛాయలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. దీంతో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రతికూలతలు కనిపిస్తుండడంతో ఓటమి భయం ఆయనను వెంటాడుతోంది. ఈ పరిస్థితులను గమనిస్తే టీడీపీ ఎన్నికల తర్వాత కనిపించదేమో అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆనం ఎదురీత

ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ టికెట్ దక్కించుకున్న ఆనం రామనారాయణరెడ్డికి ఆ సీటు ఆశించి భంగపడిన గూటూరు కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు తదితరులు సహకరించే పరిస్థితి లేదు. ఆనం ఇటీవల వేమిరెడ్డితో కలిసి ఆత్మకూరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశం ఫ్లాప్ అయింది. ఇక్కడ ఆనం అడుగడుగునా ఎదురీత ఎదుర్కొంటున్నారు.

సోదరుడే బరిలోకి దిగితే..?

కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావు తన సోదరుడి నుంచే వర్గపోరు ఎదుర్కొంటున్నారు. కందుకూరు సీటు ఆశించిన భంగపడిన ఇంటూరి రాజేష్ స్వతంత్రంగా బరిలోకి దిగే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే తన బలమైన కేడర్‌తో రాజేష్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ బలంగా ఉండడంతోపాటు సోదరుడు రాజేష్ బరిలోకి దిగితే టీడీపీ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో కానిస్టేబుల్, హోంగార్డు

- యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



టీడీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ఉదయగిరి: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని ఖాతరు చేయకపోవడంతో విమర్శలొస్తున్నాయి. వింజమూరు మండలం చాకలికొండలో సోమవారం టీడీపీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఏఆర్ కానిస్టేబుల్ రెడ్డదిన్ని బాలకృష్ణ పాల్గొన్నారు. ఈయన ప్రస్తుతం టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో ఆయనకు గన్‌మెన్‌గా విధులు నిర్వహించాడు. ప్రస్తుతం కూడా ఆయన వద్దే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. అలాగే వరికుంటపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో హోంగార్డు మల్లెల భాస్కర్ విధులకు ఎగనామం పెట్టి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇతనిది దుత్తలూరు మండలం రెడ్లదిన్నె గ్రామం.



కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో హోంగార్డు మల్లెల భాస్కర్

స్వార్థ ప్రయోజనాలకే పార్టీ ఫిరాయింపులు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉన్నత పదవులు అనుభవించిన వేమిరెడ్డి దంపతులు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీ ఫిరాయించారని, టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులను ప్రజలు తిరస్కరించి తగిన బుద్ధి చెప్పాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కోవూరు నియోజకవర్గంలోని విడవలూరులో సోమవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులతో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 6 సార్లు, ఆయన తండ్రి శ్రీనివాసులురెడ్డి 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవ చేశారని తెలిపారు. ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి అందరికీ అందుబాటులో ఉంటున్నారని, ఆయనతోపాటు నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాను కూడా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. వేమిరెడ్డి దంపతులు నల్లపరెడ్డి కుటుంబంలో కలహాలు సృష్టించేందుకు పథకం వేశారని, అయితే అది కుదరలేదని తెలిపారు. అందుకు సంబంధించిన సంభాషణ ప్రజాక్షేత్రంలోకి వచ్చిందని ప్రజలు గమనించాలని కోరారు. నల్లపరెడ్డి సోదరుల మధ్య ఎలాంటి వివాదాలు లేవని తెలిపారు. విడవలూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.224 కోట్లతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా తనను, కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి పంపి ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలిపారు. ఈ ఎన్నికలు పేదవాడికి, ధనవంతులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని.. ధనవంతులు చంద్రబాబు వైపు ఉండగా.. పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉన్నారని తెలిపారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ద్వారా పదవులు అనుభవించి వెన్నుపోటు పొడిచి ఇప్పుడు టీడీపీ నుంచి పోటీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులకు బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బరిలోకి దింపారని తెలిపారు. నెల్లూరులో ఒక సామాన్యుడు, ముస్లిం మైనార్టీ వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారనే నెపంతో వేమిరెడ్డి అలిగి వెళ్లిపోయారని, పేదలు ఎమ్మెల్యే కాకూడదా అని ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులమైన తనకు, విజయసాయిరెడ్డికి ఓటు ద్వారా తమ ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రాహేన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

- కలెక్టర్ హరినారాయణన్
- మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించేందుకు వారం ముందే ఎన్నికల ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు తెలిపారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సీ విజిల్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 257 ఫిర్యాదులు రాగా ఫిర్యాదు వచ్చిన 100 నిమిషాల్లోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో నగదు, మద్యం, ఇతర వస్తువుల తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లావ్యాప్తంగా 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచామని తెలిపారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన మార్గాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,200 లీటర్లు.. రూ.7.50 లక్షల విలువైన మద్యం, రూ.92 లక్షల నగదు, రూ.88 లక్షల విలువైన బంగారం, వెండి, రూ.7 లక్షల విలువైన ఇతర సామగ్రిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో 3 ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ పేర్కొన్నారు. పత్రికల్లో పొలిటికల్ ప్రకటనలు, కరపత్రాలు, పోస్టర్లకు సంబంధించి ప్రచురించిన 48 గంటల్లో డిక్లరేషన్ ఫాంలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అలా అందజేయని వారిపై సెక్షన్ 127ఏ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోడ్ ఉల్లంఘనపై ఇప్పటివరకు 27 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి : ఎస్పీ

2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తోందని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు. గ్రామాల్లో సీఐలు, ఎస్సైలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గ్రామపెద్దలతో మాట్లాడుతూ ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణం కల్పించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా పెట్టి ముమ్మర తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.సదారావు, డీపీఆర్‌ఓ టి.మోహన్‌రాజు, సమాచారశాఖ ఇంజినీర్ ఎ.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా పెంచండి




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్చి 18న షెడ్యూల్ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 18వ తేదీన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పట్టుబడిన రూ.10 లక్షల లోపు నగదును జిల్లా ట్రెజరీలో ఉంచాలన్నారు. అలాగే రూ.10 లక్షలు దాటిన నగదు గురించి ఇన్‌కంట్యాక్స్ అధికారులకు సమాచారమివ్వాలని ఆదేశించారు. తనిఖీల్లో పట్టుకున్న నగదును 24 గంటల్లోపు డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ ముందు ఉంచి వాటికి ఆధారాలు ఉంటే నగదు తిరిగి ఇవ్వాలన్నారు. ఆ నగదుకు ఆధారాలు లేకుంటే పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సీజ్ చేసిన నగదును ఇవ్వడంలో ఆలస్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి అన్ని నియోజకవర్గాల్లో స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ చురుకుగా పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కె .ఆరిఫ్ హాఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో ఎస్.లవన్న, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు శుభాలు కలగాలి

• వేణుంబాక విజయసాయిరెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఆకాంక్షించారు. ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సంవత్సరాదిలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులకు అంతా మంచి జరగాలని, పల్లెలు, పట్టణాల్లో ప్రతి ఇల్లు కళకళలాడాలని ఆకాంక్షించారు.

కాకాణి గోవర్ధన్‌రెడ్డికే మా మద్దతు



పార్టీలో చేరిన వారితో కాకాణి

తోటపల్లిగూడూరు: సర్వేపల్లి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డికే జనం జై కొడుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నుంచి రోజురోజుకు పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. మండలంలోని కోడూరు పంచాయతీ పాతపాళెం గ్రామానికి చెందిన 25 టీడీపీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని మంత్రి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. వారికి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గతంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన వీరందరిని ఓ టీడీపీ నాయకుడు ప్రలోభాలకు గురి చేసి రెండు రోజుల క్రితం టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేత టీడీపీ కండువాలు కప్పించాడు. అయితే ఆ పార్టీలో ఇమడలేక వారంతా గుడ్‌బై చెప్పేసి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ సోమిరెడ్డికి మరో ఓటమితో వీడ్కోలు పలికేందుకు సర్వేపల్లి ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కావల్‌రెడ్డి రవీంద్రారెడ్డి, తోటపల్లిగూడూరు సొసైటీ అధ్యక్షుడు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాతపాళెం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

• ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి నగదు, మద్యం, నాటుసారా, గంజాయి, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండలేరు పరిధిలో తగిన రసీదు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.72 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. కొడవలూరు పరిధిలో 30 మద్యం బాటిళ్లు, అల్లూరులో 13, బాలాజీనగర్‌లో 10, సెబ్ అధికారులు 204 బాటిళ్లు, మొత్తం రూ.39,788 విలువ చేసే 257 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహించి ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం, భద్రతాభావం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎక్కడైనా అతిక్రమించితే సీ విజిల్ యాప్ ద్వారా (లేదా) టోల్ ఫ్రీ నంబర్ డయల్ 112 లేదా దగ్గరలోని సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.24

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 161
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 310
లేయర్ చికెన్	: 162

చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి

• ఆర్యవైశ్యుల డిమాండ్



మాట్లాడుతున్న సాయి

నెల్లూరు(దర్గామిట్ట): 'రాష్ట్రంలోని కిరాణా షాపుల్లో ఆర్యవైశ్యులు గంజాయి అమ్ముతారంటూ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు వ్యాఖ్యానించడం దుర్మార్గం. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి' అని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సాయి పొత్తూరి అన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాల నుంచి ఆర్యవైశ్యులు కిరాణా దుకాణాలు నడుపుతున్నారని, ఎంతో గౌరవంగా జీవిస్తున్నారన్నారు. సమాజానికి ఎంతో మేలు చేస్తున్న ఆర్యవైశ్యులను కించపరిచేలా బాబు మాట్లాడారన్నారు. నెల్లూరు వాసవి కిరణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, రంగనాథస్వామి ఆలయ దేవస్థాన చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు క్షమాపణ చెప్పకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో చందోలు సతీష్, చీదేళ్ల కిషన్, సుబ్బారావు, రమస్, గిరీష్, వెంకీ, అఖిల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగం బ్యారేజీ వద్ద మృతదేహం

పొదలకూరు: మండలంలోని విరువూరు పంచాయతీ పరిధిలో సంగం బ్యారేజీ 86వ పిల్లర్ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. సుమారు 35 సంవత్సరాల వయసున్న వ్యక్తి చనిపోయాడు. మృతదేహం ముఖభాగం, రెండు చేతులు, కాళ్లు, పాదాలను చేపలు కొరికి వేశాయి. బ్యారేజీ ఒడ్డున నలుపు రంగు లోయర్, బ్లూకలర్ చొక్కా, బ్రౌన్ కలర్ చెప్పులున్నాయి. మృతుడిని తాపీమేస్త్రీగా భావిస్తున్నారు. నీటిలోకి దిగి ఈతరాక మృతిచెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు.